## సిలికాన్ వేలీలో అన్నమయ్య



సిలికాన్ వేలీ: సిరుతనవ్వుల సిన్నక్కలు సుమధురగానంతో సమ్మోహనపరచిన శుభవేళ...

బాలకులు భావమునందునా, బాహ్యమునందునా గోపాలబాలునే భావించిన భవ్యతరుణం....

పదునాలుగు గంటల పాటు వందలాది కళాకారులచే అప్రతిహతంగా అన్నమయ్యపదాలతో సుస్వరార్చన...

వందలాది ప్రేక్షకులు 'కదిలితే ఏ అనుభూతి పోగొట్టుకుంటామో' అన్న ఆతృతతో తమను తాము కట్టిపడేసుకుని సంగీతసాగరంలో ఓలలాడిన దృశ్యం...

ఇవన్నీ ఒక పరాయిదేశంలో తెలుగువారు గత శనివారం నాడు పొందిన దివ్యానుభూతుల విశేషాలు. పదకవితకు ప్రవాసంలో లభించిన అపూర్వాదరణకు నిదర్శనాలు.

అమెరికా ఖండంలోని సిలికాన్ వేలీలో తెలుగువారు అన్నమయ్యపద కవితకు మరోమారు పట్టం కట్టి పునీతులయిన సందర్భం, సిలికానాంధ్ర - సన్నివేల్ దేవాలయం (హిందూ కమ్యూనిటీ సెంటర్) సంయుక్తంగా నిర్వహించిన 'అన్నమాచార్య సంకీర్తనోత్సవం' జనవరి 20, 2007 శనివారం నాడు ఉదయం 9.గంటల నుండి రాత్రి 10.30 వరకు ఏకధాటిగా సాగిన సంకీర్తనోత్సవం శాస్త్రీయ సంగీతాభిమానులను రసమయలోకాల్లో విహరింపజేసి దిగ్విజయమయింది. సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానంతో ప్రారంభమయి, వేలాది అన్నమయ్య కృతులలో ఒక 116 కీర్తనలను పాడుతూ, నర్తిస్తూ పదకవితా పితామహునికి నివాళిగా ఒక రోజంతా సంకీర్తనోత్సవం జరుపుకున్నారు సిలికానాంధ్రులు. ప్రవేశ ద్వారం నుండి రంగు రంగుల జెండాలతో, అన్నమాచార్య

పదాలు నిండిన బ్యానర్లతో కార్యకర్తలు పండుగ వాతావరణం కల్పించారు.



## సిలికాన్ వేలీలో అన్నమయ్య

Page: 3



మొదటగా సుమారు 40 మంది కళాకారులు గోష్ఠిగానంలో అన్నమాచార్యుని 7 ప్రముఖ రచనలతో నిండిన సప్తగిరి సంకీర్తనలతో వీనులవిందు చేశారు. అటుపై ప్రవాసంలో ఉన్న 318 మంది గాయనీగాయకులు, నర్తకీ నర్తకులు, వాద్యకారులు ఒక్కొక్కరుగా, బృందాలుగా వేలాది అన్నమయ్య కీర్తనల్లో తమకు నచ్చిన గీతాలను తమదైన శైలిలో ఆలాపించి ప్రేక్షకులను మైమరపింపచేశారు. కాలిఫోర్నియా రాష్ట్రంలోని పలు ప్రదేశాల నుండి విచ్చేసిన 1500 పైగా ప్రేక్షకులు హరినామ సంకీర్తనా సుధలను అందించినందుకు భావమునందు, బాహ్యమునందు సిలికానాంధ్ర కార్యకర్తలకు కృతజ్ఞతలందించారు. అన్నమయ్య పదాలకు అనుగుణంగా నర్తించినా, గీతాలను ఏ శైలిలో ఆలాపించినా రసమయలోకాల్లో విహరించి ఆ పదాలలో ఉన్న మాధుర్యాన్ని ఆసాంతమూ ఆస్వాదించారు సిలికాన్ వేలీలో తెలుగువారు.

నాటి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు కె.వి. రమణాచారి ఆశీ: పూర్వక ప్రసంగం చేస్తూ ‘అన్నమయ్య కరుణామృతం వర్షిస్తే అది ప్రథమంగా సిలికానాంధ్ర కోసమే అవుతుంద’ని ప్రేక్షకుల చప్పట్ల నడుమ అన్నారు. సిలికానాంధ్ర సాంస్కృతిక రంగంలో చేస్తున్న కృషిని అభినందిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాంక్షించారు.


సిలికానాంధ్ర

## సిలికాన్ వేలీలో అన్నమయ్య






ఈ సంకీర్తనోత్సవానికి శ్రీమతి హేమ కోట, వైజయంతి సుసర్ల నేతృత్వం వహించారు. వారి సారథ్యంలో సిలికానాంధ్ర కార్యకర్తలు అహోరాత్రులూ శ్రమించి 318 మంది కళాకారులు పాడేందుకు అనువైన వాతావరణం కల్పించారు. ఎంతో శ్రద్ధతో బ్యాక్‌డ్రాపు తయారు చేసి సభా వేదికను అందంగా తీర్చిదిద్దారు కార్యకర్తలు. శ్రీహరి శాస్త్రి, శ్రీలక్ష్మి కోలవెన్ను, గాయత్రి అవ్వారి లు కృతులను పలుమంది ఆలాపించడానికి, గోష్ఠిగానానికి విశేష సాయమందించారు. శ్రీలక్ష్మి కోలవెన్ను కృషికి గుర్తింపుగా దుశ్శాలువతో, మకుటంతో సత్కరించారు. కార్యక్రమం ఆసాంతమూ పెద్ద తెరపై కృతుల వివరాలను, పాడేవారిని దగ్గరగా చూపించడం అదనపు ఆకర్షణ. వంశీ నాదెళ్ళ, నారాయణ రాజులు సాంతమూ వీడియో విభాగాన్ని సమర్థవంతంగా నిర్వహించి మన్ననలందుకున్నారు.

నాటి సాయంకాలం భారతదేశం నుండి అన్నమాచార్య ప్రాజెక్టు నిర్దేశకులు మేడసాని మోహన్ దూరవాణిలో తమ సందేశాన్ని వినిపించారు. 'సిలికానాంధ్ర తపనవల్లే అనేక అసామాన్య విజయాలు లభిస్తున్నాయని తెలిపారు. అందుకు కొనసాగింపుగానే సుమారు 150 అన్నమయ్య కృతులకు స్వరకల్పన చేసే బాధ్యత సిలికానాంధ్రకు అందిస్తున్నామ'ని అన్నారు. కూచిభొట్ల ఆనంద్ ప్రసంగిస్తూ, అఖిల భారత అన్నమాచార్య ఉత్సవానికి దేశవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తోందని, అనేక ఊళ్ళలో ఇప్పటికే ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఆంధ్ర రాష్ట్రంలో ప్రతి జిల్లాకు రెండు కేంద్రాల్లో నిర్వహిస్తామని తెలిపారు.



## సిలికాన్ వేలీలో అన్నమయ్య

Page: 5




నాటి కార్యక్రమానికి మరోప్రత్యేకత, కార్యకర్తలే స్వయంగా వడ్డించిన విందు భోజనం. దిలీప్ కొండపర్తి నేతృత్వంలో రవి కూచిభొట్ల, రవి చివుకుల, అనంత్ రావు, మృత్యుంజయుడు, అన్నం అనిల్ మొదలుగాగల బృందం సుమారు 1500 మందికి పైగా వండి వడ్డించి నిజమైన విందు భోజనం రుచిచూపించారని అందరిచేతా ప్రశంసలందుకున్నారు. సిలికానాంధ్ర సంప్రదాయ స్ఫూర్తిని నిలబెట్టే తపనకు ఇది మరో నిదర్శనం.

అనేకమంది పిల్లలు కార్యక్రమం గూర్చి వ్యాఖ్యానిస్తూ, 'కేవలం ఒక్కరోజుకే పరిమితమవక కనీసం రెండు రోజులపాటు నిర్వహించాల్సింది'గా విజ్ఞప్తి చేశారు. ప్రేక్షకులు, దాదాపుగా అందరూ అంగీకరించిన విషయం- ఈ కార్యక్రమం ద్వారా తమ పిల్లలకు తమ సాంస్కృతిక వారసత్వాన్ని గురించి, తెలుగు భాష గురించి తెలుపగలిగే అవకాశం లభించిందని. నాటి కార్యక్రమ దిగ్విజయం సిలికాన్ వ్యాలీలోని అన్నమాచార్యుని అభిమానులందరికీ మరో మరువలేని అనుభూతిని మిగిల్చింది.



## సిలికాన్ వేలీలో అన్నమయ్య





అన్నమాచార్య రాగరాగిణి

సిలికానాంధ్ర ప్రస్థానంలో మరో మైలురాయి 'అన్నమాచార్య రాగరాగిణి'. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిభొట్ల ఆనంద్ ప్రసంగిస్తూ 'గత మూడేళ్ళుగా సిలికానాంధ్ర దీక్షగా నిర్వహిస్తున్న సంకీర్తనోత్సవాలను, గతేడాది ఆంధ్రరాష్ట్రంలో నిర్వహించిన అఖిలాంధ్ర అన్నమయ్య సంకీర్తనోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని మొట్టమొదటిసారిగా తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు వారు ఒక ప్రవాస సంస్థకు అన్నమయ్య కృతులను స్వరపరచే బాధ్యతను అప్పగించార'ని మార్మోగిన ప్రేక్షకుల చప్పట్ల నడుమ ప్రకటించారు. సిలికానాంధ్ర, ఈ కృషికి 'అన్నమాచార్య రాగరాగిణి' అన్న పేరుపెట్టి, రాబోయే రెండేళ్ళల్లో ఈ కృతులను స్వరపరుస్తామని ప్రకటించారు.

